# చెరకాలం అనంతరం దేవుని ప్రజల స్వదేశాగమనం

ఇశ్రాయేలీయులు బబులోనులో (యూదా రాజ్యపు ప్రజలు నివసించిన కాలం గురించి (క్రీస్తు పూర్వం ఆరవ శతాబ్దం) బైబిల్లో వివరాలు అంతగా లేవు. చెర కాలంలో యెరూష లేంలోని దేవాలయంలో ఆరాధన నిలిచిపోయింది. అయితే, బబులోనులో యూదులు తమ దేవుణ్ణి ఆరాధించుకోవచ్చని బబులోను రాజులు అనుమతించారు. చెరలో వున్న ఇశ్రా యేలీయులు (యూదులు) తమ పితరుల గాథలను మననం చేసుకున్నారు. ప్రవక్తల సందే శాలు విన్నారు. మోషే ధర్మశాస్త్రాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. ఈ కాలంలోనే ఇశ్రా యేలు యాజకుల్లో కొందరు ప్రజలు తమ ఉనికిని మర్చిపోకుండా లేఖనాల్లో కొన్ని అదనపు వివరాలను చేర్చడం జరిగింది.

## స్వదేశంలో యూదులు

క్రీ.పూ. 539లో పారసీక రాజైన కోరెషు బబులోనును జయించాడు. యించుమించు ఒక సంవత్సరం తర్వాత, యూదులు తమ స్వదేశానికి తిరిగి వెళ్ళవచ్చని కోరెషు రాజు ఆదే శించాడు. పాత నిబంధనలోని ఎజ్రా నెహెమ్యా గ్రంథాలు చెర అనంతరం సుమారు వంద సంవత్సరాల చరిత్రను తెలియజేస్తాయి. హగ్గయి జెకర్యా ప్రవక్తలు రాసిన గ్రంథాలు కూడ ఈ కాలం నాటివే. యాజకుడైన ఎజ్రా సుమారు క్రీ.పూ. 500-425 మధ్య కాలంలో యూదులు తమ మతాచారాలను తిరిగి పాటించాలని వారు మోషే ధర్మశాస్త్రానికి లోబ డాలని ప్రోత్సహించాడు. యితర ప్రాంతాలకు చెందిన స్త్రీలను వివాహం చేసుకొన్న యూదులు తమ భార్యలను విడిచిపెట్టాలని కూడ ఎజ్రా పట్టుపట్టాడు (ఎజ్రా 9,10).

చెర నుంచి తిరిగి వచ్చిన యూదులకు రెండు విషయాలు ఎంతో ప్రాముఖ్యంగా కనిపించాయి.

యెరూషలేంలో పున:నిర్మించిన దేవాలయంలో ఇశ్రాయేలు దేవుణ్ణి ఆరాధించడం.

ప్రస్తుత పరిస్థితుల్లో దేవుని ప్రజలు ఎలా జీవించాలో తెలసుకోవడానికి మోషే ధర్మశాస్త్రాన్ని అధ్యయనం చేయడం,నెహెమ్యా కూడ ఈ కాలంలోనే యూదాకు అధిపతికి వున్నాడు. యెరూషలేం ప్రాకారాల పునర్నిర్మాణ పనులను నెహెమ్యా స్వయంగాపర్యవేక్షించాడు కూడ. ప్రజలకు మతస్వేచ్ఛ ఉన్నప్పటికీ, దేశం మాత్రం యింకా పారసీక పాలనలోనే వుంది.

## యూదా వెలుపల

కొందరు ప్రజలు యెరూషలేంలో స్థిరపడుతుండగా మరికొందరు పారసీక పాలనలో వున్న యితర ప్రాంతాల్లోనే కొనసాగారు. మరికొందరు తూర్పున వున్న మధ్యధరా ప్రాంతంలోని ప్రధాన పట్టణాలకు తరలి వెళ్ళారు. యిలా వెళ్ళారు. యిలా వెళ్ళిన యూదుల్లో కొన్ని వర్గాలవారు లేఖనాలను వ్యాఖ్యానించడంలో తమదైన ఒక విలక్షణ పద్ధతిని అవలంభించారు. ఈ కాలంనాటి యూదు రచనల్లో అనేకం ఈజిప్టులోని అలెగ్జాండ్రియా ప్రాంతానికి చెందినవి. అలెగ్జాండ్రియా పట్టణానికి చెందిన యూదు బోధకులు కొందరు లేఖనాలతో బాటు గ్రీకు వేదాంతాన్ని కూడ అధ్యయనం చేశారు బైబిల్లోని ప్రాధమిక సత్యాలను అర్థం చేసుకోడానికి ఈ అధ్యయనం దోహదం చేస్తుందని వీరి నమ్మకం.

## అలెగ్జాండరు చక్రవర్తి ప్రభావం

క్రీ.పూ.336-323 మధ్య కాలంలో మాసిదోనియాకు చెందిన అలెగ్జాండరు చక్రవర్తి తూర్పు మధ్యధరా ప్రాంతంలో దాదాపు చాలా భాగాన్ని (ఈజిప్టు పాలస్తీనా పారసీకంలో చాలా భాగంతో సహా) జయించాడు. అలెగ్జాండరు మరణానంతరం దాదాపు ఒక శతాబ్ధం పైగా ఈ ప్రాంతాలన్నీ అతని సేనాధిపతులు పరిపాలనలో వున్నాయి. వీరిలో సిరియా ప్రాంతాన్ని పరిపాలించిన సెల్యూకడ్ కుటుంబంవారు, ముఖ్యులు, దాదాపుగా పాలస్తీనా వీరిరువురి పరిపాలనలోనే కొనసాగింది. అయితే, క్రీ.పూ.168లో సెల్యూకడ్ రాజైన నాల్గవ అంతియోకస్ ఎపిఫానెస్ యూదులు తమ మతాన్ని అవలంభించకుండా వారిని అడ్డుకున్నాడు. మోషే ధర్మశాస్త్రాన్ని అధ్యయనం చేయడాన్ని విశ్రాంతి దివాచరణను సున్నతిని ఈ రాజు నిషేదించాడు. పైగా, ఈ రాజు యూదుల దేవాలయంలో గ్రీకు దేవత ద్యుపతి ప్రతిమను నిలబెట్టాడు. యితని కార్యాలు యూదులను తీవ్ర మనస్తాపానికి గురిచేశాయి.

అయితే, యెరూషలేంలో ఆరాధన కొనసాగింది. యూదులు వార్షిక పన్నులు చెల్లిస్తూ దేవాలయ నిర్వహన బాధ్యతను యాజకుల పోషణ బాధ్యతను కొనసాగించారు కూడ, బబులోను చెర కాలం నుంచి కూడ యూదులు గృహాల్లో లేక బహిరంగా సమావేశాల్లో లేఖనాలను అధ్యయనం చేయసాగారు. యూదు లేఖనాల్లోని నీతియుక్తమైన ఉపదేశాలు దేవుని గురించి సంగతులు యూదేతరులు దృష్టిని సహితం ఆకర్షించాయి. యూదు సమాజంలో చేరడానికి కొందరు యూదేతరులు సున్నతి సంస్కారాన్ని సహితం పాటించారు.

గ్రీకు రోమన్ పారసీక వేదాంతాలు తత్వ సిద్ధాంతాలు ఈ కాలంనాటి యూదుల సాహిత్యాన్ని ప్రభావితం చేశాయి. వీటి ప్రభావం అపొక్రిఫాలోని కొన్ని గ్రంథాల్లో చాలా స్పష్టంగా కన్పిస్తుంది.

చెర అనంతరం యూదు సమాజంలో పెక్కు మార్పులు చోటు చేసుకున్నాయి. జెలోతేయులు సద్దూకయ్యాలు పరసయ్యులే ఎస్సేనీయులు వంటి వివిధ వర్గాలేర్పడ్డాయి. వీరందరి లక్ష్యం ఒకటి కాదు. సరిగ్గా యిలాంటి పరిస్థితులున్నకాలంలోనే దేవుని గురించి దేవుని రాజ్యం గురించి బోధించడానికి యేసు వచ్చాడు.

## యూదులు తమ దేశాన్ని తిరిగి దక్కించుకొనడం

నాల్గవ అంతియోకస్ ఎపిఫానెస్‌కు వ్యతిరేకంగా యూదులు తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాటు హఠాత్తుగా ప్రారంభమైంది. ఈ విప్లవానికి యూదా మక్కాబీ నాయకుడు. మక్కాబీ అనే పేరుకు 'సుత్తి' అని అర్థం యూనదా మక్కాబీ నేతృత్వంలో యూదులు అంతియోకస్ సైన్యాన్ని ఓడించారు. ఈ విప్లవం గురించి అపొక్రిఫాలోని 1 మక్కాబీయులు, 2మక్కాబీయులు గ్రంథాలు వివరిస్తాయి..యూదులు అంతియోకస్‌ను ఓడించి దేవాలయాన్ని శుద్ధిచేసిన సంఘటనను నేటికి యూదులు జ్ఞాపకం చేసుకుంటారు. యిదే హనుక్కా పండుగ.

తుదకు,మక్కాబీయులు తమ స్వంత ప్రభుత్వాన్నేర్పరుచుకున్నారు. యూదా మక్కాబీ అనంతరం పరిపాలించిన అతని కుటుంబీకులు తమను తాము రాజులని అని పిలుచుకున్నారు. వాస్తవానికి, వీరు దావీదు వంశస్థులుగానీ యూదా గోత్రీకులు గానీ కారు. వీరి చర్య యూదుల్లో చాలామందిని నిరాశపరిచింది. మక్కాబీయులు నిరంకుశపాలన అధికారంలో కొనసాగడానికి రోమా ప్రభుత్వంతో వారు చేసికోన్న ఒప్పందాలు వారి పట్ల ప్రజల్లో అయిష్టత కలిగించాయి. రోమన్ సేనాని పొంపే యెరూషలేంపై దండెత్తి యూదా ప్రాంతాన్నంతా రోమన్ల వశం చేయడంతో (క్రీ.పూ63) పాలస్తీనాల్లో మక్కాబీయుల పాలన ముగిసింది.

మక్కాబీయుల పాలన యూదులకు అసంతృప్తిని కలిగించింది ఫలితం - యూదుల్లో కొందరు వేర్వేరు సిద్ధాంతాల వైపు ఆకర్షితులయ్యారు. ఉదా: యూదుల్లో ఒకవర్ణంవారు యెరూషలేం దేవాలయంలోని యాజకులతో అసంతృప్తి చెందారు. దేవాలయ నిర్వహన బాధ్యతల్లో ఉన్న యాజకులు సంపదపట్ల అధికారం పట్ల మక్కువ చూపడం వీరి అసంతృప్తికి కారణం. ఈ వర్గానికి చెందినవారు సమాజానికి దూరంగా మృతసముద్రం సమీపంలోని నిర్జన ప్రాంతాల్లో నివసించారు. వారు తాము అర్థం చేసుకున్న రీతిలో దేవుని ధర్మశాస్త్రానికి

లోబడుతూ బాహ్య ప్రపంచంతో ఏ సంబంధం లేకుండా జీవించారు. ప్రస్తుత యాజకుల ను తరిమికొట్టి యెరూషలేం పట్టణాన్ని దేవాలయాన్ని బాగుచేయడానికి దేవుడు తమకు సహాయం చేస్తాడని వీరి నమ్మకం.

ఇరవయ్యో శతాబ్దం మధ్య భాగంలో ఈ వర్గానికి చెందిన కొన్ని రచనలను మృతసముద్రం సమీపంలోని ఖుమ్రాన్ వద్ద కనుగొన్నారు.ఈ సాహిత్యాన్నే మృతసముద్రపు గ్రంథపు చుట్టలు అంటారు. ఈ గ్రంథాల్లో యెషయా గ్రంథపు అతి పురాతన ప్రతి లభ్యమైంది. ఈ సమాజం వారి తీరుతెన్నులను నిర్దేశించే నియమావళి వున్న గ్రంథం కూడ లభ్యమైంది.